క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో స్వామికి మంగళవారం విశేషంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణ శర్మ ఈ పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రం డీసీపీ పరిశీలన



ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న డీసీపీ-2 మాధురి

పెందుర్తి: స్థానికప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్‌ను డీసీపీ-2 మాధురి మంగళవారం పరిశీలించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉపాధ్యాయ ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట పెందుర్తి సీఐ, ఎస్‌ఐలు ఉన్నారు.

3 కిలోల హాష్ ఆయిల్ పట్టివేత

పెందుర్తి: ఏజెన్సీ ప్రాంతం నుంచి విశాఖకు అక్రమంగా తరలిస్తున్న రూ.5 లక్షల విలువైన 3 కిలోల హాష్ ఆయిల్(లిక్విడ్ గంజాయి)ని వేపగుంట ప్రాంతంలో పెందుర్తి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. లిక్విడ్ గంజాయిని తరలిస్తున్న జి.మాడుగుల మండలం చినబంద గ్రామానికి చెందిన కొర్రా లక్ష్మీ(36), అన్నవరం పంచాయతీ సోమవారం గ్రామానికి చెందిన శోభా కృష్ణ(40)లను అరెస్టు చేశారు. వీరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్-1985 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు సీఐ ఎస్వీ సతీష్‌కుమార్ తెలిపారు. అక్రమ కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు అనుమానం ఉన్న వ్యక్తులపై సమాచారం అందించాలని కోరారు.

మందుబాబులకు జరిమానా


పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలను నడుపుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. వీరిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.10 వేలుచొప్పున మొత్తం రూ.60 వేలు జరిమానాను న్యాయమూర్తి విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు.

సోలార్ విద్యుత్‌తో డబ్బు ఆదా



గోడపత్రికను ప్రదర్శిస్తున్న ఆర్‌ఈసీఎస్ ఎండీ ప్రసాద్

అగనంపూడి: సోలార్ విద్యుత్ వినియోగించడం ద్వారా ఆర్థిక భారం తగ్గించుకోవచ్చని ఆర్‌ఈసీఎస్ మేనేజింగ్ డైరెక్టర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్ అన్నారు. అగనంపూడి ఆర్‌ఈసీఎస్ సెక్షన్ కార్యాలయంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలతోపాటు అన్ని వర్గాల ప్రజలకు రాయితీ ధరకు సోలార్ యూనిట్ అందిస్తుందన్నారు. గేటెడ్ కమ్యూనిటీలకు వెళ్లి అసోసియేషన్ ప్రతినిధులకుఅవగాహన కల్పించారు. డీఈఈలు ఎస్.రామకృష్ణ,శివశంకర్ వర ప్రసాద్ పాల్గొన్నారు.



కృష్ణరాయపురంలో మహాశివుడు


పరమ శివుడికి ఎంతో ప్రీతికరమైన రోజు మహాశివరాత్రి. శైవక్షేత్రాలన్నీ ఓం నమః శివాయ.. హరహర మహాదేవ శంభో శంకర మంత్రాలతో మార్మోగుతాయి. హిందూ ధర్మం ప్రకారం శివరాత్రి రోజైన బుధవారం ఆదిశంకరుడిని పూజిస్తే ముక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం. రోజంతా ఉపవాసం, రాత్రంతా జాగరణ చేస్తే వెయ్యింతల పుణ్యఫలం దక్కుతుందని పురాణాలు చెబుతున్నాయి. అందుకే నియోజకవర్గంలోని శైవ క్షేత్రాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి.

- నియోజకవర్గంలో మహాశివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు
- సుందరంగా ముస్తాబైన శైవక్షేత్రాలు
- నేటి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు

శివోహం.. చిదానంద రూపం



విద్యుత్ కాంతులతో పినగాడి శివాలయం



విద్యుత్ కాంతులతో రాంపురం కోనేరులో శివాలయం

పెందుర్తి: మహా శివరాత్రి పూజలకు నియోజకవర్గంలోని శైవ క్షేత్రాలు సొబగులద్దుకున్నాయి. ఆలయాలకు రంగులు, విద్యుత్ దీపాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, జాగరణ కథాకాలక్షేపం కోసం ఏర్పాట్లు చేశారు. బుధవారం రోజంతా శివ నామ స్మరణతో జాగరణ చేసి, మరుసటిరోజు సముద్ర స్నానమాచరిస్తే అంతా మంచే జరుగుతుందని ప్రజల నమ్మకం. అందుకే పరవాడ, సబ్బవరం తీర ప్రాంత పరిధి ఆలయాల్లో కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూజల కోసం తొలి వేకువ నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తనుండటంతో వారికి ఇబ్బందుల్లేకుండా వసతులు సిద్ధం చేశారు. భక్తుల సౌకర్యార్థం మంచినీరు, మజ్జిగ వితరణ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

స్వయంభువుడు.. రామలింగేశ్వరుడు

శతాబ్దం క్రితం పెందుర్తి సాధుమఠం వద్ద రామలింగేశ్వర స్వామి స్వయంభువుగా వెలిశాడు. స్వయంభూ లింగావతారంలో వెలసిన ఈ శివుడిని కొలిస్తే మంచి జరుగుతుందని ప్రజల ప్రగాఢ నమ్మకం. పెందుర్తి ప్రాంతం నుంచే కాకుండా నగరం నుంచి కూడా ఇక్కడకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి ఏటా మహాశివరాత్రి రోజున పూజలు నిర్వహిస్తుంటారు. ఈ రోజున స్వామికి రుద్రాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించనున్నారు.

- సరిపల్లిలోని పురాతన శివాలయం ప్రసిద్ధి గాంచింది. ఇక్కడ శివునికి పూజలు చేస్తే కష్టాలన్నీ తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.
- పినగాడిలోని గణేష పార్వతి సమేత చోడేశ్వర స్వామి ఆలయాన్ని శివరాత్రి పూజల కోసం విద్యుత్ దీపాలతో ప్రత్యేకాలంకరణ చేశారు. వేకువజాము నుంచి స్వామికి ప్రత్యేకాభిషేకాలు జరుగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.
- శ్రమశక్తినగర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయం, సుజాతనగర్ హరహర క్షేత్రం, కృష్ణరాయపురం, గణేష్‌నగర్, చింతలగ్రహారం, సరిపల్లి శివాలయాల్లో శివరాత్రి వేడుకలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.
- మహాకామేశ్వరీ పీఠం, చినముషిడివాడ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని ఆయా దేవాలయాల ప్రతినిధులు తెలిపారు.




ముస్తాబైన సాధుమఠం రామలింగేశ్వరస్వామి దేవాలయం

ముత్యాలమ్మపాలెం తీరంలో..

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరంలో మహాశివరాత్రి పండగ మహోత్సవానికి ఉత్సవ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. భక్తులు బుధవారం రాత్రికి తీరంలో జాగరణ చేసి, గురువారం సూర్యోదయాన సముద్రంలో పుణ్య స్నానాలు ఆచరించి, తీరంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడిని దర్శించుకోవడం ఆనవాయితీ. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొంది అచ్చిబాబు ఆధ్వర్యంలో నిర్వహించే మహాశివరాత్రి మహోత్సవంలో జిల్లా నలుమూలల నుంచి తీరంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తుల కోసం స్నాన ఘట్టాలు, మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు ఏర్పాటు చేశారు. తీరంలో గజ ఈతగాళ్లను నియమిస్తున్నట్లు కమిటీ తెలిపింది. తీరంలో జాగరణ చేసే భక్తుల కోసం బుధవారం రాత్రికి రేలారే రేలా, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. గురువారం ఉదయం భక్తులకు ఉచిత ప్రసాదం, మంచినీరు, మజ్జిగ పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపట్టామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



ముత్యాలమ్మపాలెం తీరంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడు



శివరాత్రి పూజలకు సిద్ధమైన ప్రశాంతినగర్ రామలింగేశ్వరస్వామి

దేవీపురంలో ప్రత్యేక పూజలు



దేవీపురంలోని శ్రీచక్రాలయం

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గురుమాత అన్నపూర్ణమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం గో పూజతో ప్రారంభమై దక్షవాటిలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 4 నుంచి 5 వరకు పల్లకీ సేవ, 5 నుంచి 7 వరకు కామాఖ్య కల్యాణం జరుగుతుందన్నారు. రాత్రి 10 నుంచి లింగోద్భవ కాలం వరకూ కొండమీద శివాలయంలో రాజరాజేశ్వరునికి, ఆనంద భైరవుడికి పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఫార్మా పరిశ్రమల్లో జీరో స్థాయికి ప్రమాదాలు

- సేఫ్టీ వర్క్‌షాప్‌లో అధికారులకు కలెక్టర్ విజయ కృష్ణన్ సూచన



సమావేశంలో ప్రసంగిస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



పాల్గొన్న భద్రత, తయారీ విభాగాల అధికారులు

పరవాడ: ఔషధ పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. జేఎన్ ఫార్మా సిటీలో మాన్యుఫాక్చరింగ్ అసోసియేషన్, ముత్యాలమ్మ వల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మెడికేషన్ భవన సముదాయంలో ఏపీ పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రాసెస్ సేఫ్టీ వర్క్‌షాప్‌లో పాల్గొని, ప్రసంగించారు. ఫార్మా పరిశ్రమల్లో పనిచేసే భద్రత, తయారీ విభాగాల అధికారులు ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. విధి నిర్వహణలో చాలా అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకురావాలన్నారు. రానున్న రోజుల్లో ప్రమాదరహిత ఉత్పత్తులను సాధించాలని సూచించారు. ఉద్యోగుల భద్రతకు పూర్తి ప్రాముఖ్యత కల్పించాలన్నారు. ప్రస్తుతం నిర్వహించిన ప్రాసెస్ సేఫ్టీ వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీరో యాక్సిడెంట్ పరిశ్రమలుగా తీర్చిదిద్దడానికి జేఎన్‌పీసీ యాజమాన్యాలు కృషి చేయాలని ఎంఏఎస్‌ఆర్‌ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు సూచించారు. జెట్టి సుబ్బారావుకు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ జ్ఞాపిక అందించి, సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీవీఎస్ నారాయణ, ఎస్‌వోహెచ్‌ఎస్ అధ్యక్షుడు రామసుబ్బారావు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌నకు హాజరైన భద్రత, తయారీ విభాగాధికారులకు జేసీఐఎఫ్ శివశంకర్‌రెడ్డి సర్టిఫికెట్లను అందించారు.

ఘనంగా పరదేశిమాంబ పండగ



పరదేశిమాంబ సన్నిధిలో పరవాడ ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు

పరవాడ: గ్రామంలో కొలువైన పరదేశిమాంబ అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని జనసేన పార్టీ నాయకులు పంచకర్ల ప్రసాద్ ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మాజీ ఆర్‌ఈసీఎస్ చైర్మన్ చల్లా కనకారావు, కూటమి నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, బుగిడి రామగోవిందరావు, రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. డప్పులు, చిడతలు, తప్పెటగుళ్ల, నేల డ్యాన్సులతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. భారీ బాణ సంచా వెలుగుల నడుమ అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో వర్రి హరి, రెడ్డి ఎర్రినాయుడు, పైల సురేష్, గండి నమో, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా.. తీర్థమహోత్సవాలు



పైడివాడలో దుర్గాలమ్మ



లగిశెట్టిపాలెం సీతారాముల తీర్థంలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెంలోని సీతారాముల తీర్థమహోత్సవం, పైడివాడ గ్రామంలోని దుర్గాలమ్మ, పరదేశమ్మ అమ్మవార్ల పండగ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్టీ స్థానిక శ్రేణులతో కలిసి పైడివాడలోని దుర్గాలమ్మ, పరదేశమ్మ అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం లగిశెట్టిపాలెంలోని సీతారాములను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు ముత్యాలనాయుడు, పాలిశెట్టి సురేష్‌రాజ్, దేవీ సాంబ, వద్దాది అప్పలరాజు, సబ్బవరపు నారాయణమూర్తి, కాపుశెట్టి శేషుబాబు, రాపేటి రాము, బోను గంగునాయుడు, గొర్లి రాజేష్, కర్రి శ్రీను, దనిమిరెడ్డి శ్రీనివాస్, గవర రాజు, మామిడి కొండాజీ, యర్ర శ్రీను, మహాలక్ష్మినాయుడు, ఎన్‌పీ రాజు, చిరికి దేముడు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దాల్సింది అంగన్‌వాడీలే



జ్ఞాన జ్యోతి ముగింపు సమావేశంలో పాల్గొన్న అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

పరవాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న 3-5 ఏళ్ల విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని పరవాడ మండల విద్యాశాఖాధికారులు దివాకర్‌రావు, సాయి శైలజ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఈ నెల 18 నుంచి ప్రారంభమైన జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. రిసోర్స్ పర్సన్ల సహకారంతో ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం వివిధ రకాల కృత్యాలతో ఆరు రోజులు నిర్వహించిన శిక్షణ, విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణ తరగతుల్లో పాఠశాల హెచ్‌ఎం బి.అప్పలనాయుడు, డి.శ్రీనివాసరావు, జి.సతీష్, జి.శ్రీనివాసరావు, లక్ష్మి, షకీలా, లలితకుమారి పాల్గొన్నారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి అంగన్‌వాడీలు కీలకం

- పాఠశాల విద్య ఆర్జేడీ విజయభాస్కర్



జ్ఞానజ్యోతి శిక్షణలో మాట్లాడుతున్న విజయభాస్కర్

పెందుర్తి: పిల్లల్లో సమగ్ర అభివృద్ధికోసం కృషి చేసేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇది మంచి అవకాశమని స్కూల్ ఎడ్యుకేషన్ జిల్లా ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు విజయభాస్కర్ అన్నారు. స్థానిక పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, ప్రసంగించారు. పిల్లలకు నేర్పే అంశాలు వారికి తెలియకుండానే వారి జ్ఞానాభివృద్ధికి తోడ్పడేలా కృషి చేయాలన్నారు. జిల్లా సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. పిల్లలకు ఆట పాటలతో కూడిన జ్ఞానాన్ని అందించాలన్నారు. ఆటల ఆధారిత అభ్యసన ప్రక్రియ ద్వారా పిల్లల్లో సమగ్రాభివృద్ధి జరిగి, గ్రేడ్ వన్‌లో ప్రవేశానికి సిద్ధం చేసే బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కె.సువర్ణ, పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ చిన్నమ్మాయి, రిసోర్స్ పర్సన్స్, ఐసీడీఎస్ సీడీపీవో ఎన్.నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల్లో ఒత్తిడికి గురికావొద్దు

- డీఈవో ప్రేమ్‌కుమార్



కళ్లద్దాలు అందిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

అగనంపూడి: ఒత్తిడికి గురికాకుండా ఎక్కువ మార్కులు సాధించేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని డీఈవో ప్రేమ్‌కుమార్ అన్నారు. అగనంపూడి పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారో ఆరా తీశారు. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి అగస్త్య ల్యాబ్ సైన్స్ ఎక్స్‌పోలో ప్రతిభ చూపిన విద్యార్థులను, బయాలజీ టీచర్ కృష్ణవేణిని అభినందించారు. అలాగే మోహిసిన్ ఐ బ్యాంక్ గుర్తించిన 34 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.

ఆర్యభట్ట పాలిటెక్నిక్‌లో క్యాంపస్ డ్రైవ్



ఎంపికైన అభ్యర్థులతో కళాశాల అధ్యాపకులు, కంపెనీ ప్రతినిధులు

సబ్బవరం: మండలంలోని గాలిభీమవరం ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాలలో అచ్యుతాపురానికి చెందిన యొకొహోమా ప్రై.లి. కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహించిన డ్రైవ్‌లో 88 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. వీరిలో అర్హత కలిగిన 16 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధీర్‌బాబు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను కళాశాల సెక్రటరీ సీహెచ్ మహంతినాయుడు అభినందించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు అప్పారావు, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోజులు మద్యం షాపులు బంద్

- ఎమ్మెల్సీ ఎన్నికల వేళ ఆంక్షలు



మద్యం షాపును మూయిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

సబ్బవరం: ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నుంచి సబ్బవరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మద్యం షాపులను మూసేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ డి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ సబ్బవరం మండలంలోని 8 మద్యం షాపులు, పరవాడ మండలంలోని 14 మద్యం షాపులు, రెండు బార్లు మూసివేసి, సీల్ వేసినట్లు పేర్కొన్నారు. 27న సాయంత్రం ఎన్నికల ప్రక్రియ ముగిశాక యథావిధిగా షాపులు తెరుచుకోవచ్చన్నారు. ఎక్కడైనా బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తూ పట్టుబడితే సంబంధిత మద్యం షాపు యజమానులపై రూ.5 లక్షల వరకూ జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. రెండో సారి పట్టుబడితే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే గ్రామాల్లో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.